అక్షరశక్తి
The Power of Pen
Evening Daily
సంపుటి: 20 | సంచిక: 293 | వరంగల్ | బుధవారం, 26 ఆగస్టు 2026 | పేజీలు: 4

రాజకీయాల్లో పూల పాన్పు, ముళ్ళ బాట రెండూ ఉంటాయి. వ్యాపార రంగంలో క్లాస్ వన్ గా నిలిచినా, అనేక అవమానాలు, ఆటుపోట్లు ఎదుర్కొని రాజకీయాల్లో రాణించానని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు. వ్యాపారంతో నాయకుల పరిచయాలు సంపాదించి, పరకాలలో ప్రతీ గడపలో అడుగుపెట్టి, ప్రజా ప్రతినిధిగా ప్రజాభిమానం సంపాదించి...చెరిగిపోని చల్లా మార్క్ సొంతం చేసుకున్నారు. తన వ్యాపార, రాజకీయ రంగాల ప్రస్థానాన్ని, తొలి అడుగుల నేపథ్యాన్ని చల్లా ధర్మారెడ్డి డిజిటల్ మీడియా వేదికగా జరిగిన చిట్ చాట్ లో తన అంతరంగ ఆలోచనలను పంచుకున్నారు.

- అక్షరశక్తి,ప్రధాన ప్రతినిధి

# ఆశయం పుట్టింది అవమానం నుండే!

## రాజకీయాలు పూలపాన్పు కాదు

- వ్యాపారం రాజకీయాలకు ఎంట్రీ ఇచ్చింది
- పరకాల ప్రతీ గడప సమస్యలు తెలుసు
- ప్రజలు, కార్యకర్తలే నా బలం
- టెక్స్‌టైల్ పార్కు తేవడం ఎమ్మెల్యే కంటే ఎక్కువ ఆనందం ఇచ్చింది
- కార్యకర్తల కోసం మళ్లీ ఎమ్మెల్యే అవుతా

SPECIAL PAGE



## కాంగ్రెస్ పార్టీని వదిలే ప్రసక్తే లేదు

- కొండా మురళి
- భట్టి విక్రమార్కతో భేటీ అనంతరం కీలక వ్యాఖ్యలు
- సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం
- పార్టీ క్రమశిక్షణ కమిటీ నిర్ణయాన్ని గౌరవిస్తాం

2





## వీకెండ్ మత్తు

- రోడ్లపై మృత్యు నృత్యం
- తరచూ వాహన ప్రమాదాలు
- డ్రంక్ అండ్ డ్రైవ్ నిఘా పెరగాలన్న ప్రజలు

3

వీకెండ్ పార్టీలు, ఫామ్‌హౌస్‌లు, రిసార్టుల సంస్కృతి యువతలో రోజురోజుకూ పెరుగుతూ ప్రమాదకరంగా మారుతోంది. పుట్టిన రోజులు, బ్యాచ్‌లర్ పార్టీలు, ఫ్రెండ్స్ గెట్‌టుగెదర్స్ పేరుతో మద్యం, గంజాయి, డ్రగ్స్ సేవించి రాత్రివేళ వాహనాలు నడుపుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.

- అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్

# బీసీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీకి దరఖాస్తుల ఆహ్వానం

**సెప్టెంబర్ 13లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి**

**అక్షరశక్తి,ములుగు:** వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కుట్టు మిషన్లను అందించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి. రామ్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి, తెలంగాణ రాష్ట్రానికి చెందిన అర్హులైన బీసీ మహిళలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల సమర్పణకు సెప్టెంబర్ 13 చివరి తేదీ అని, గడువు ముగిసిన అనంతరం వచ్చిన దరఖాస్తులను స్వీకరించబోమని స్పష్టం చేశారు. అర్హులైన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, కుట్టు మిషన్ ద్వారా స్వయం ఉపాధి పొందాలని బి. రామ్మోహన్ కోరారు.

# చల్లా పరామర్శ..

**అక్షరశక్తి,పరకాల:** పట్టణానికి చెందిన జర్నలిస్ట్ ఓదెల శివ తండ్రి బిక్షపతి మృతిచెందిన విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బిక్షపతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీని వదిలే ప్రసక్తే లేదు

- కొండా మురళి
- భట్టి విక్రమార్కతో భేటీ అనంతరం కీలక వ్యాఖ్యలు
- సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం
- పార్టీ క్రమశిక్షణ కమిటీ నిర్ణయాన్ని గౌరవిస్తాం



**అక్షరశక్తి,హనుమకొండ:** కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి స్పష్టం చేశారు. తన కుమార్తె కొండా సుస్మిత చేసిన రాజకీయ వ్యాఖ్యలతో తమకు ఎలాంటి సంబంధం లేదని, అవి ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఈ అంశంపై తాను మరిన్ని వ్యాఖ్యలు చేయబోనని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో భేటీ అనంతరం ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కొండా మురళి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక బిల్లుకు సంబంధించిన అంశంపై చర్చించేందుకే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసినట్లు ఆయన తెలిపారు. ఈ భేటీకి రాజకీయ ప్రాధాన్యత ఆపాదించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీతో తమకు ఎలాంటి విభేదాలు లేవని, తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని కొండా మురళి తేల్చి చెప్పారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీపై తమకు పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్నారు. పార్టీ క్రమశిక్షణ కమిటీకి తమ వాదనను ఇప్పటికే స్పష్టంగా వివరించామని, ఇకపై కమిటీ తీసుకునే నిర్ణయాన్ని గౌరవిస్తామని తెలిపారు.

**సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం...**

తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉంటుందని కొండా మురళి అన్నారు. తన బిడ్డకు స్వతంత్రంగా మాట్లాడే హక్కు ఉందని, ఆమె అభిప్రాయాలను తాను గౌరవిస్తానని తెలిపారు. అయితే ఆమె చేసిన వ్యాఖ్యలకు తమ కుటుంబం లేదా తన రాజకీయ వైఖరికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

"ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయి. నా కుమార్తె అభిప్రాయం ఆమె వ్యక్తిగతం. ఆమెను ప్రశ్నించే హక్కు నాకు లేదు. ఆమెకు స్వతంత్రంగా మాట్లాడే హక్కు ఉంది" అని కొండా మురళి పేర్కొన్నారు.

**రాజకీయ నిర్ణయాలు వ్యక్తిగతమే....**

బీఆర్ఎస్ నుంచి కవిత బయటకు రాలేదా? అని ప్రశ్నించిన కొండా మురళి.. రాజకీయాల్లో ఎవరి నిర్ణయాలు వారివేనని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి తీసుకునే రాజకీయ నిర్ణయాలను మరో వ్యక్తి నిర్ణయాలతో ముడి పెట్టడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. తమకు పార్టీపై, పార్టీ నాయకత్వంపై పూర్తి నమ్మకం ఉందని మరోసారి స్పష్టం చేసిన కొండా మురళి.. పార్టీ కమిటీకి చెప్పాల్సిన విషయాలన్నీ ఇప్పటికే చెప్పామని తెలిపారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఈ అంశంపై తాను ఎలాంటి అదనపు వ్యాఖ్యలు చేయబోనని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయాన్ని తాము గౌరవిస్తామని కొండా మురళి పేర్కొన్నారు. పార్టీకి విధేయంగా ఉంటూ కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీ నాయకత్వంపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని చెబుతూ.. పార్టీని వీడే ఆలోచన తమకు లేదని తేల్చి చెప్పారు. భట్టి విక్రమార్కతో జరిగిన భేటీ అనంతరం కొండా మురళి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# గ్రామాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యం





- 4 కోట్ల 46 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- వ్యవసాయ మార్కెట్ యార్డుల అభివృద్ధికి 3 కోట్ల 11 లక్షల రూపాయలు
- శివాపూర్, గోగుపల్లిలో కోటి 35 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లు ప్రారంభం

**అక్షరశక్తి, ములుగు:** గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం తాడ్వాయి, ఏటూరునాగారం మండలాల్లో 4 కోట్ల 46 లక్షల రూపాయలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తాడ్వాయి వ్యవసాయ మార్కెట్ యార్డులో 83 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

అనంతరం సీఆర్ఆర్-ప్లెయిన్ 2025-26 నిధులతో ఏటూరునాగారం మండలం శివాపూర్ గ్రామంలో 80 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డు, సీసీ డ్రైన్లను ప్రారంభించారు. శివాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గోగుపల్లిలో 55 లక్షల రూపాయలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అనంతరం ఏటూరునాగారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ నిధులు 2 కోట్ల 28 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రహదారులు, మురుగునీటి కాలువల నిర్మాణంతోపాటు వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో వసతుల కల్పనకు అవసరమైన నిధులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వీకెండ్ మత్తు..

## రోడ్లపై మృత్యు నృత్యం.. తరచూ వాహన ప్రమాదాలు.. డ్రంక్ అండ్ డ్రైవ్ నిఘా పెరగాలన్న ప్రజలు

**అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్:**

వీకెండ్ పార్టీలు, ఫామ్‌హౌస్‌లు, రిసార్టుల సంస్కృతి యువతలో రోజురోజుకూ పెరుగుతూ ప్రమాదకరంగా మారుతోంది. పుట్టిన రోజులు, బ్యాచ్‌లర్ పార్టీలు, ఫ్రెండ్స్ గెట్ టుగెదర్స్ పేరుతో మద్యం, గంజాయి, డ్రగ్స్ సేవించి రాత్రివేళ వాహనాలు నడుపుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. మత్తులో అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు అమాయకుల ప్రాణాలను సైతం ప్రమాదంలోకి నెడుతున్నారు. ఈ మధ్య మద్యం మత్తులో జరిగే ప్రమాదాలే ఎక్కువగా ఉంటున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. అయినా వాహనదారుల్లో ఎలాంటి భయం కనిపించడం లేదు.



**మత్తు...ప్రాణం చిత్తు**

ఇటీవల హనుమకొండలో మద్యం మత్తులో యువకులు నడిపిన కారు ఢీకొన్న ఘటనలో ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోవడం కలకలం రేపింది. ఈ ఘటన మద్యం మత్తులో డ్రైవింగ్ ఎంతటి విషాదానికి దారితీస్తుందో స్పష్టం చేసింది. నిందితులు ప్రయాణించిన కార్లలో పెద్ద సంఖ్యలో బీరు బాటిళ్లు, ఇతర అభ్యంతరకర వస్తువులు లభించినట్లు సమాచారం. అయినప్పటికీ ఇలాంటి ఘటనల నుంచి యువత పాఠాలు నేర్చుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రహదారి నిఘా పెరగాలి...**

ఇటీవల ఎక్కువ రహదారి ప్రమాదాలు పెరుగుతుండటం ఆందోళనకరంగా మారింది. వీకెండ్‌లలో నిర్వహించే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు మరింత కఠినంగా చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, ఖరీదైన వాహనాలపైనా విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని, ఫామ్‌హౌస్‌లు, రిసార్టుల్లో నిబంధనల అమలుపై నిఘా పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. వరంగల్ నుంచి మేడారం, ఏటూరునాగారం, ములుగు ప్రాంతాలకు వెళ్లే కొందరు యువత మద్యం సేవించి అల్లర్లకు పాల్పడటంతో పాటు పర్యాటక ప్రాంతాలను కలుషితం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మద్యం, డ్రగ్స్ మత్తులో వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వీకెండ్‌లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఒక్కరి నిర్లక్ష్యం కారణంగా అమాయకుల ప్రాణాలు పోవడంతో కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా కుంగిపోతున్నాయని ఆవేదన వ్యక్తమవుతోంది. క్షణిక ఆనందం కోసం జీవితాలను, ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టకుండా యువత బాధ్యతాయుతంగా వ్యవహరించేలా పోలీసులు, అధికారులు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది అని ప్రజలు అంటున్నారు.

# కుల గణనలో ఓపెన్ ఎండెడ్ విధానాన్ని రద్దు చేయాలి

**అక్షరశక్తి,హనుమకొండ:** 2027 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనాభా లెక్కల్లో బీసీ కులాల వివరాల నమోదుకు ప్రతిపాదించిన ఓపెన్ ఎండెడ్ ప్రశ్నల విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం తెలంగాణ, హనుమకొండ జిల్లా శాఖ ప్రకటించింది. కుల గణనలో ప్రతి కులానికి ప్రత్యేక డ్రాప్‌డౌన్ సూచీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. ప్రస్తుతం ప్రతిపాదించిన విధానం ప్రకారం జనాభా లెక్కల సేకరణ సమయంలో ప్రజలు ఏ కులం పేరు చెబితే అదే పేరును నమోదు చేసే అవకాశం ఉంది. అయితే భారత్‌లో ఒకే కులాన్ని వివిధ ప్రాంతాల్లో వేర్వేరు పేర్లు, ఉపకులాలు, భాషా రూపాల్లో గుర్తించే పరిస్థితి ఉందని ఫోరం పేర్కొంది. దీంతో ఒకే కులానికి చెందిన వ్యక్తులు జనగణనలో భిన్న పేర్లతో నమోదైతే, ఒకే కులం అనేక పేర్లుగా విడిపోయే ప్రమాదం ఉందని తెలిపింది.



ఈ విధానం వల్ల దేశవ్యాప్తంగా కులాల సంఖ్య వాస్తవానికి మించిన స్థాయిలో నమోదయ్యే అవకాశం ఉందని, ఫలితంగా కుల గణన ద్వారా సేకరించే గణాంకాలు ప్రయోజనకరంగా లేకుండా పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా వెనుకబడిన, అత్యంత బలహీన, విధివంచిత వర్గాలకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని పేర్కొంది.

అదేవిధంగా ప్రతిపాదిత జనగణన ప్రశ్నావళిలో 'వెనుకబడిన వర్గాలు' అనే అంశాన్ని స్పష్టంగా చేర్చకపోతే దేశంలో ఓబీసీల వాస్తవ జనాభా ఎంత అన్నది నిర్ధారించడం కష్టమవుతుందని ఫోరం అభిప్రాయపడింది.

ఈ సమస్యకు పరిష్కారంగా జనగణన సమయంలో ప్రతి కులానికి ఒక ప్రత్యేక కోడ్‌తో కూడిన డ్రాప్‌డౌన్ సూచీని రూపొందించాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం సూచించింది. తెలంగాణ, బిహార్ రాష్ట్రాల్లో నిర్వహించిన కుల గణనల్లో అనుసరించిన విధానాలను పరిశీలించి, వాటి ఆధారంగా కేంద్ర ప్రభుత్వం తగిన మార్పులు చేయాలని కోరింది. ప్రస్తుతం ప్రకటించిన ప్రశ్నావళిని రద్దు చేసి, రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, నిపుణులు, ప్రజాప్రతినిధులు, ప్రజలతో విస్తృతంగా చర్చించిన అనంతరం కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం తెలంగాణ హనుమకొండ జిల్లా శాఖ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

## శ్రీధరాచార్యులకు ఘన సన్మానం



**అక్షరశక్తి,వరంగల్:** ఎల్‌బీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఠంయ్యాల శ్రీధరాచార్యులను వరంగల్, ఖిలా వరంగల్ తెలుగు కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ త్యాగరాయ గానసభలో శృతిలయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల అందుకున్న ఎస్. జానకి స్ఫూర్తి పురస్కారం సందర్భంగా ఈ సన్మానం నిర్వహించారు. జడ్పీఎస్ఎస్ మామునూర్ ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరసింహారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 2023లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న శ్రీధరాచార్యులు ఇప్పటివరకు 500కుపైగా సన్మానాలు, 200కుపైగా అవార్డులు పొందారు. ఆయన పాడిన 'రారా బడికిరా' పాట రెండు తెలుగు రాష్ట్రాల్లో విశేష ఆదరణ పొందింది. మరిన్ని అవార్డులు, సన్మానాలు పొందాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

## పోలీస్‌అధికారులు, సిబ్బందిని అభినందించిన సీపీ



**అక్షరశక్తి,హన్మకొండ క్రైమ్:** పోలీస్ స్టేషన్ పరిధిలో క్యాటరింగ్ కాంట్రాక్ట్ పేరు హాస్టల్ యజమానులను మోసం చేస్తూ లక్షల్లో సొమ్మును కాజేసిన నిందితుడుని పట్టు కోవడంలో ప్రతిభ కనబరిచిన హన్మకొండ ఇన్స్ స్పెక్టర్ శివ కుమార్, ఏఏఓ సల్మాన్ పాషాతో పాటు కానిస్టేబుళ్ళు కిరణ్ కుమార్,రమణకుమార్, రవి, మహిళా కానిస్టేబుల్ కారుణ్య, హోం గార్డ్ రవిని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపిఎస్ సీపీ కార్యాలయంలో అభినందించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి శాఖపరమైన గుర్తింపు వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత,హన్మకొండ కొండ ఏసీపీ నర్సింహారావు పాల్గొన్నారు.

## ఉద్యోగ సంఘాల జేఏసీ మహాధర్నాను విజయవంతం చేయండి

**ఆకుల రాజేందర్**

**అక్షరశక్తి, హనుమకొండ:** ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తి అవుతున్న ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రేపు గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరిగే మహా ధర్నాలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, వర్కర్లు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్వాడి సిబ్బంది, ఆశ వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని మహా ధర్నాను విజయవంతం చేయాలని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ పిలుపునిచ్చారు.



## ఆరోగ్య కేంద్రంలో వసతులు

# ఆరోగ్యంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**అక్షరశక్తి,రాయపర్తి:** రాయపర్తి లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పల్లె దవాఖానా లో వ్యాధి నిరోధక టీకా లు చిన్నారులకు వేస్తున్న తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలోని మందుల నిల్వలను తనిఖీ చేసి, గడువు తీరిన మందుకు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మందులను సురక్షితంగా భద్రపరిచే తీరును పరిశీలించారు. ల్యాబొరేటరీ లో మందుల నిలువ, ఇతర వైద్య సామగ్రి గురించి ల్యాబ్ ఇన్‌చార్జిని అడిగి తెలుసుకున్నారు. ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ల్యాబ్ ఇన్‌చార్జిని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో కూడా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందులు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆరోగ్య కేంద్రానికి సమస్యలతో వచ్చిన పేషెట్స్ తో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి మాటల్లో ఆసుపత్రి లో అందుతున్న వైద్య సేవల గురించి వారి మాటల్లో తెలుసుకున్నారు. ఈ ఆకస్మిక తనిఖీలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాష్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణ్,సంబంధిత గ్రామ సర్పంచ్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.






# మహిళా సంఘాలే మాదకద్రవ్య రహిత సమాజానికి సంఘమిత్రలు



**అక్షరశక్తి,జనగామ:** మాదకద్రవ్యాల నిర్మూలనలో మహిళా సంఘాల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి మహిళ తన కుటుంబంతో పాటు గ్రామాలు, పట్టణాలను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడే సంఘమిత్రగా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు నిర్వహించిన 'సంఘమిత్ర-మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు'లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్వేత మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, అదే చైతన్యాన్ని సమాజ భద్రతకు వినియోగించాలని కోరారు. యువతే రాష్ట్ర భవిష్యత్తు అని, వారిని డ్రగ్స్‌కు దూరంగా ఉంచడం ప్రతి కుటుంబం, మహిళా సంఘం బాధ్యత అని అన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల మెదడు, నరాల వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని, వ్యసనానికి గురైన వారిని నేరస్తులుగా కాకుండా చికిత్స, పునరావాసం ద్వారా సాధారణ జీవితంలోకి తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో గంజాయి విక్రయాలు, రవాణా, వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే 112కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు అవసరమైతే బహుమతులు అందిస్తామని తెలిపారు.

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జనగామ జిల్లాలో సుమారు 1.25 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులు ఉన్నారని, వారి ద్వారా ప్రతి ఇంటికి డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని తీసుకెళ్లవచ్చని అన్నారు. డ్రగ్స్ కారణంగా ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబాల్లో గృహహింస, ఆర్థిక, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ డ్రగ్స్ మొదట సరదాగా ప్రారంభమై చివరకు ప్రాణాంతక వ్యసనంగా మారుతుందని హెచ్చరించారు. పిల్లల ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు, ఆలస్యంగా ఇంటికి రావడం, కొత్త స్నేహాలు, అనుమానాస్పద అలవాట్లు వంటి లక్షణాలను తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. ఎన్‌డీపీఎస్ చట్టం1985 ప్రకారం మాదకద్రవ్యాల విక్రయం, రవాణా, వినియోగం, దాచిపెట్టడంపై కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు.

సదస్సులో సైకాలజిస్ట్ డాక్టర్ విజయక్రాంతి మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక దుష్ప్రభావాలు, చికిత్స, పునరావాసంపై అవగాహన కల్పించారు. పోలీస్ జాగృతి కళాబృందం, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికల ద్వారా డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం పాల్గొన్న వారంతా డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏసీపీలు భీం శర్మ, నర్సయ్య, ఏపీడీ నూరుద్దీన్, ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వేణు, జానకీరాంరెడ్డి, సతీష్, చాకలి ఐలమ్మ సమాఖ్య నాయకురాలు మమతతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.

రాజకీయాల్లో పూల పాన్పు, ముళ్ళ బాట రెండూ ఉంటాయి. వ్యాపార రంగంలో క్లాస్ వన్ గా నిలిచినా, అనేక అవమానాలు, ఆటుపోట్లు ఎదుర్కొని రాజకీయాల్లో రాణించానని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు. వ్యాపారంతో నాయకుల పరిచయాలు సంపాదించి, పరకాలలో ప్రతీ గడపలో అడుగుపెట్టి, ప్రజా ప్రతినిధిగా ప్రజాభిమానం సంపాదించి...చెరిగిపోని చల్లా మార్క్ సొంతం చేసుకున్నారు. తన వ్యాపార, రాజకీయ రంగాల ప్రస్థానాన్ని, తొలి అడుగుల నేపథ్యాన్ని చల్లా ధర్మారెడ్డి డిజిటల్ మీడియా వేదికగా జరిగిన చిట్ చాట్ లో తన అంతరంగ ఆలోచనలను పంచుకున్నారు. - అక్షరశక్తి,ప్రధాన ప్రతినిధి

# ఆశయం పుట్టింది

## అవమానం నుండే!

### రాజకీయాలు పూలపాన్పు కాదు

వ్యాపారం రాజకీయాలకు ఎంట్రీ ఇచ్చింది

పరకాల ప్రతీ గడప సమస్యలు తెలుసు

ప్రజలు, కార్యకర్తలే నా బలం

టెక్స్‌టైల్ పార్కు తేవడం ఎమ్మెల్యే కంటే ఎక్కువ ఆనందం ఇచ్చింది

కార్యకర్తల కోసం మళ్లీ ఎమ్మెల్యే అవుతా



**తన హయాంలో చేపట్టిన ప్రధాన పనులు ఇవే..**

- 2016లో పరకాల రెవెన్యూ డివిజన్ పునరుద్ధరణ
- కొనాయిమాకుల ప్రాజెక్టు పనులు
- కొత్త మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలు
- పరకాల ప్రజల చిరకాల కోరిక అయిన 100 పడకల ఆస్పత్రి
- డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు
- బాలురు, బాలికలతో పాటు ఆరు రెసిడెన్షియల్ విద్యా-సంస్థలు
- 46 గ్రామాల్లో మహిళా భవనాలు
- 57 గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు
- పరకాల పట్టణ సుందరీక-రణ, సెంట్రల్ లైటింగ్
- దామెర చెరువులో బోటింగ్
- పాత మార్కెట్ అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం
- కంఠాత్మకూరు బ్రిడ్జికి నిధులు
- పల్లె దవాఖానలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు
- టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు

ఆనందాన్నిచ్చింది..
వరంగల్‌కు ఒకప్పుడు అజంజాహి మిల్ ఎంతటి గుర్తింపు తెచ్చిందో, ఆ స్థాయి ఉపాధి అవకాశాలు కల్పించేలా తన నియోజకవర్గానికి టెక్స్‌టైల్ పార్క్ తీసుకురావడం తనకు అత్యంత ఆనందాన్ని ఇచ్చిన విషయమని చల్లా ధర్మారెడ్డి చెప్పారు. "అజంజాహి మిల్ తర్వాత వరంగల్ ప్రాంతానికి అదే స్థాయిలో ఉపాధి కల్పించే పరిశ్రమ రావాలనేది నా ఆలోచన. దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్క్ పరకాల నియోజకవర్గానికి రావడం సంతోషంగా ఉంది" అని అన్నారు.

**ప్రగతిసింగారం నుంచి ప్రస్థానం...**

శాయంపేట మండలం ప్రగతి సింగారం గ్రామంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన సమ్మక్క–మల్లారెడ్డి దంపతులకు ముగ్గురు కుమారులు కాగా, తాను పెద్దవాడినని ధర్మారెడ్డి చెప్పారు. రెండో తమ్ముడు మరణించాడని, 1986లో మేనమామ కుమార్తె జ్యోతితో వివాహం జరిగిందన్నారు. తండ్రి తనను వ్యవసాయంలోనే కొనసాగించాలని భావించినా.. తనకు మాత్రం కొత్తగా ఏదైనా చేయాలనే ఆసక్తి ఉండేదన్నారు. డిగ్రీ చదువుకుంటున్న సమయంలోనే స్నేహితుడి సహకారంతో ఫినలెక్స్ కంపెనీలో 'మార్కెటింగ్ మేనేజర్ గా పనిచేశానని తెలిపారు. అప్పట్లో వ్యవసాయ బావులు, పొలాలకు పైప్‌లైన్లు వేసే కార్యక్రమాలు విస్తృతంగా సాగుతుండటంతో ఆ రంగంపై మంచి అవగాహన ఏర్పడిందన్నారు.

**నంది పైప్స్‌తో వ్యాపారంలోకి**

1993లో సొంతంగా నంది పైప్స్, లూబీ ఎలక్ట్రికల్స్ కంపెనీల డిస్ట్రిబ్యూటర్ తీసుకున్నా. 1994లో అప్పటి టీడీపీ ప్రభుత్వం స్వజలధార, గ్రామాలకు నీటి సౌకర్యం కల్పించే పథకాలను ప్రవేశపెట్టడంతో పైపులు, మోటార్లకు భారీ డిమాండ్ ఏర్పడిందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 80 శాతం ఆర్డర్లు తానే తీసుకున్నానని తెలిపారు. పైపులు, మోటార్ల సరఫరా చేస్తూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రాజకీయ నాయకులతో పరిచయాలు ఏర్పడ్డాయని చెప్పారు. అప్పటి నుంచే ఎర్రబెల్లి దయాకర్‌రావుతో సాన్నిహిత్యం ఉందన్నారు. తన అమ్మకాల ప్రతిభను గుర్తించిన నంది పైప్స్ సంస్థ 1997లో మారుతి కారును బహుమతిగా ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు.

**కాంట్రాక్టర్ గా కొత్త ప్రయాణం....**

1999లో ప్రభుత్వ పనుల్లో కాంట్రాక్టర్లే మెటీరియల్ కొనుగోలు చేయాలనే విధానం రావడంతో తన వ్యాపారంపై ప్రభావం పడిందన్నారు. సరఫరా చేసిన మెటీరియల్‌కు బిల్లులు సకాలంలో రాకపోవడం, కొందరు డబ్బులు ఎగ్గొట్టడంతో నష్టాలు ఎదురయ్యాయని చెప్పారు. అయితే నేను ఇతరులకు సరఫరా చేస్తే బిల్లుల కోసం ఎదురు చూడాల్సి వస్తుందని, స్వయంగా కాంట్రాక్టర్‌గా మారితేనే పరిస్థితి మారుతుందని నిర్ణయించుకున్నానన్నారు. 1999లో కాంట్రాక్టర్‌గా అడుగుపెట్టి.. 2002 నాటికి స్పెషల్ గ్రేడ్ కాంట్రాక్టర్‌గా ఎదిగానని చెప్పారు. చల్లా ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ను ప్రారంభించి 2003 నుంచి పెద్ద ప్రాజెక్టులు చేపట్టినట్లు తెలిపారు.



## ఇంటింటికీ మీ చల్లాతో ప్రజా సమస్యలు తెలిసాయి

2013 నవంబర్ 22న 'ఇంటింటికీ మీ చల్లా' కార్యక్రమాన్ని ప్రారంభించి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను చుట్టివచ్చానని తెలిపారు. ఒక్కో గ్రామంలో మూడు రోజుల పాటు ఉండి, ఉదయం-సాయంత్రం ప్రజలతో మమేకమయ్యానన్నారు. ఈ పర్యటన దాదాపు ఏడాది పాటు సాగిందని చెప్పారు. ప్రతీ ఇంటి పరిస్థితి, గ్రామాల్లోని మౌలిక సమస్యలు, రోడ్లు, కరెంటు, తాగునీరు, పేదరికం వంటి అంశాలను స్వయంగా తెలుసుకున్నానన్నారు. ఒక గ్రామంలో ఆకలితో పస్తులు పడుకున్న డిగ్రీ విద్యార్థినిని చూసిన ఘటన తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఈ పాదయాత్ర ద్వారా



గ్రామాల అవసరాలపై స్పష్టమైన అవగాహన వచ్చిందని, తర్వాత చేపట్టిన అభివృద్ధి పనులకు అదే ప్రణాళికగా మారిందన్నారు. రాజకీయాల్లో అడుగు పెట్టిన తర్వాత ఎన్నో దాడులు ఎదుర్కొన్నాను. 2011-12 మధ్య నందిరాం నాయక్ తండాలో ప్రభ బండ్ల ప్రారంభోత్సవానికి వెళ్లిన సమయంలో ప్రత్యర్థి పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేశారని తెలిపారు. కొబ్బరి కాయ కొట్టేందుకు వంగిన సమయంలోనే దాడి జరగడంతో తాను, కార్యకర్తలు ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీశామని చెప్పారు. కొందరితో కలిసి మొక్కజొన్న చేనులో దాక్కున్నట్లు తెలిపారు. ఘటనపై సమాచారం అందడంతో భారీగా పోలీసులు అక్కడికి చేరుకున్నారని, అప్పట్లో ఈ ఘటన నియోజకవర్గంలో సంచలనం సృష్టించిందన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి వచ్చి తనకు అండగా నిలిచారని గుర్తుచేసుకున్నారు. 2009లో కూడా తన వెంట వచ్చిన ఆరు కార్లను ధ్వంసం చేశారని తెలిపారు. రాజకీయాల్లో మంచి, చెడు రెండూ ఉంటాయని ముందే నిర్ణయించుకుని వచ్చానన్నారు.

**ఎమ్మెల్సీ అవకాశం వచ్చినా వద్దన్నా..**

2009లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం వచ్చినప్పటికీ.. తన లక్ష్యం ప్రత్యక్ష ఎన్నికలేనని చెప్పి తిరస్కరించినట్లు తెలిపారు. అదే ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ-టీఆర్ఎస్ పొత్తులో భాగంగా పరకాల సీటు టీఆర్ఎస్‌కు వెళ్లిందన్నారు. టీఆర్ఎస్ తరఫున పోటీ చేయాలని కోరినా అంగీకరించలేదని చెప్పారు.

**బీ ఫాం కోసం సినిమా తరహా డ్రామా....**

2009 ఎన్నికల్లో నామినేషన్ దాఖలు చేసే రోజు జరిగిన పరిణామాలు ఇప్పటికీ మర్చిపోలేనివని చెప్పారు. చివరి నిమిషంలో పార్టీ నుంచి బీఫాం వస్తుందని సమాచారం రావడంతో డ్రైవర్‌ను పార్టీ కార్యాలయానికి పంపానన్నారు. బీఫాంలతో కారు బయలుదేరిన సమయంలో ఫాతిమా బ్రిడ్జి వద్ద కొందరు పార్టీ నాయకులు కారును అడ్డుకుని బీఫాంలను తీసుకున్నారని తెలిపారు. తనకు రావాల్సిన బీఫాం మరొకరికి వెళ్లిందని, మళ్లీ ఫాంలను సరిచేసుకుని వచ్చేలోపే నామినేషన్ కేంద్రం గేట్లు మూసివేశారని చెప్పారు. పోలీసులు తనను బలవంతంగా గేటు బయటికి తీసుకెళ్లగానే మా డ్రైవర్ గోడ దూకి లోపలికి వచ్చారని, నిమిషాల తేడాతో నామినేషన్ దాఖలు చేసే అవకాశం కోల్పోయానన్నారు. ఆ ఘటన మొత్తం సినిమా క్లైమాక్స్‌ను తలపించిందని వ్యాఖ్యానించారు.

**2012లో తొలి ఎన్నికల పోరు...**

2012 ఉప ఎన్నికల్లో పరకాల నుంచి టికెట్ దక్కిందని, పోటీ చేసి 33 వేల ఓట్లు సాధించినట్లు తెలిపారు. పార్టీకి చెందిన కొందరే తనకు ప్రతికూల పరిస్థితులు కల్పించడంతో ఓడిపోయానని అన్నారు. ఈ విషయం చంద్రబాబునాయుడికి తెలియడంతో సంబంధిత నాయకులను మందలించారని చెప్పారు. ఆ సమయంలోనే పరకాల నియోజకవర్గంతో పాటు శాయంపేటలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు మొత్తం 263 కంప్యూటర్లను అందజేసినట్లు తెలిపారు.

**యువగర్జనకు పరకాలకు స్పెషల్ ట్రైన్**

నందమూరి బాలకృష్ణ రాజకీయ ప్రవేశ సమయంలో గుంటూరులో నిర్వహించిన యువ గర్జన సభకు పరకాల నియోజకవర్గం నుంచి ప్రత్యేక రైలును ఏర్పాటు చేయడం అప్పట్లో పెద్ద చర్చకు దారితీసిందన్నారు. జిల్లా నాయకుడిని తనకు ఒక బోగీ ఇవ్వాలని కోరగా.. ఇంకా తనకు పదవి లేదని, ఇవ్వలేమని చెప్పారని తెలిపారు. దీంతో సభ ఇన్‌చార్జ్ ఎర్రం నాయుడు వద్దకు వెళ్లి ప్రత్యేక రైలు ఏర్పాటు చేయడానికి ఎంత ఖర్చవుతుందని తెలుసుకుని.. ఆ మొత్తాన్ని చెల్లించి వరంగల్ నుంచి పరకాల నియోజకవర్గ కార్యకర్తల కోసం ప్రత్యేక రైలు వేయించుకున్నట్లు చెప్పారు. రైలు నిండా కార్యకర్తలను తీసుకెళ్లడమే కాకుండా వారికి భోజనం, తాగునీటి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం అప్పట్లో రాజకీయంగా పెద్ద హల్‌చల్ సృష్టించిందన్నారు.

**తెలంగాణ కోసం పోరాటం....**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో పరకాల నియోజకవర్గంలో ఉద్యమాన్ని పెద్ద ఎత్తున నడిపానని చెప్పారు. టీడీపీలో కొనసాగుతున్నప్పటికీ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడానన్నారు. నిరాహార దీక్షలకు టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేయడమే కాకుండా 41 రోజుల పాటు ఉద్యమ కార్యక్రమాలను కొనసాగించినట్లు



తెలిపారు.

**2014లో గెలుపు.. టీఆర్ఎస్‌లోకి చేరిక**

2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి పరకాల అసెంబ్లీకి పోటీ చేసి విజయం సాధించానన్నారు. తనపై ఉన్న అభిమానంతో కార్యకర్తలు కష్టపడి గెలిపించారని తెలిపారు. ఆ తర్వాత వారి అభీష్టం మేరకు టీఆర్ఎస్‌లో చేరినట్లు చెప్పారు.

**పదేళ్లలో రూ.2,500 కోట్ల అభివృద్ధి..**

ఎమ్మెల్యేగా పదేళ్ల కాలంలో పరకాల నియోజకవర్గానికి సుమారు రూ.2,500 కోట్ల అభివృద్ధి పనులు తీసుకొచ్చినట్లు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. 'ఇంటింటికీ మీ చల్లా' పర్యటనలో గుర్తించిన సమస్యల్లో దాదాపు 90 శాతం పరిష్కరించానన్నారు. ప్రతీ ఎమ్మెల్యేకు రూ.5 కోట్ల నిధులు వచ్చే రోజుల్లోనూ ప్రత్యేకంగా పట్టుబట్టి రూ.35 కోట్ల వరకు నిధులు తీసుకొచ్చి పనులు చేపట్టినట్లు చెప్పారు.

**పుట్టిన ఊరికి ప్రత్యేక అభివృద్ధి**

తాను పుట్టిన ప్రగతిసింగారం గ్రామాన్ని అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టానన్నారు. గ్రామ పంచాయతీని మోడల్‌గా తీర్చిదిద్దడంతో పాటు సొంత స్థలంలో రామాలయం నిర్మించినట్లు చెప్పారు. ప్రభుత్వ స్థలంతో పాటు ఎకరం భూమిని కొనుగోలు చేసి కమ్యూనిటీ హాల్, గ్రామ ప్రజల కోసం ఫంక్షన్ హాల్ నిర్మించినట్లు తెలిపారు. స్కూల్, లైబ్రరీ, ఆస్పత్రి ఏర్పాటు చేశానన్నారు.

***భూ కబ్జాల ఆరోపణలు రాజకీయమే..**

తనపై వస్తున్న భూ కబ్జా ఆరోపణలను చల్లా ధర్మారెడ్డి ఖండించారు. రాజకీయ లబ్ధి కోసమే తనపై ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. "ఏ ఒక్క రైతు భూమిని నేను అక్రమంగా తీసుకోలేదు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల జోలికే వెళ్లలేదు. నేను కొనుగోలు చేసినవన్నీ పట్టా భూములే.. అవి కూడా న్యాయబద్ధంగానే కొనుగోలు చేశా" అని స్పష్టం చేశారు. రాజకీయాల్లో ముళ్లకంప, పూలపాన్పు రెండూ ఉంటాయని, కష్టాలు సహజమని అన్నారు. తాను ఎప్పుడూ వ్యక్తిగత దూషణలకు వెళ్లలేదని, రాజకీయ ప్రత్యర్థులను రాజకీయంగానే ఎదుర్కొంటానన్నారు.



**కేసీఆర్ తో ప్రత్యేక అనుబంధం...**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని చల్లా ధర్మారెడ్డి చెప్పారు. మాట ఇస్తే నిలబెట్టుకునే వ్యక్తి కేసీఆర్ అని, ఆయన మంచి విజన్ ఉన్న నాయకుడని చెప్పారు. తనపై కేసీఆర్‌కు ప్రత్యేక అభిమానం ఉండేదని, ఆ అనుబంధంతోనే పరకాల నియోజకవర్గానికి అధిక నిధులు తీసుకురాగలిగానని చెప్పారు. తాను ఎవరిపైనా చాడీలు చెప్పనని, వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉంటానని అన్నారు. అందుకే కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్‌రావు తనను అభిమానిస్తారని పేర్కొన్నారు.

**వచ్చే ఎన్నికల్లో సత్తా చూపిస్తా...**

వాస్తవానికి గత ఎన్నికల్లో గెలిస్తే రాజకీయాలకు విరామం ఇవ్వాలని భావించానని చల్లా ధర్మారెడ్డి తెలిపారు. అయితే ప్రస్తుతం రాజకీయాల్లో కనిపిస్తున్న కక్షపూరిత వాతావరణం, తనను నమ్ముకున్న కార్యకర్తల పరిస్థితిని చూసి మరోసారి పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. గత ఎన్నికల్లో జరిగిన తప్పులను గుర్తించానని, వాటిని సరిదిద్దుకుని ముందుకు సాగుతానన్నారు. నియోజకవర్గంలోని 109 గ్రామ పంచాయతీల్లో తనకు బలమైన పట్టు ఉందని, పునర్వ్యవస్థీకరణ జరిగినా, నియోజకవర్గాల సరిహద్దులు మారినా, ఎక్కడి నుంచి పోటీ చేయాలో నిర్ణయించుకుని వచ్చే ఎన్నికల్లో తప్పకుండా బరిలో ఉంటానని స్పష్టం చేశారు. "ఈసారి నా కోసం కాదు.. నన్ను నమ్ముకున్న కార్యకర్తల కోసం గెలవాలి. ప్రజలు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం ఉంది" అని చల్లా ధర్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## అవమానం పెంచిన కసి.. రాజకీయాల్లోకి ఎంట్రీ

**2008లో శాయంపేట, ప్రగతిసింగారం మధ్య చలివాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. ఆ పనులకు సంబంధించిన బిల్లుల విషయంలో అప్పటి ప్రజాప్రతినిధి తనను ఇబ్బంది పెట్టారని, ఒకసారి వారి ఇంటికి వెళ్లినప్పుడు ఎదురైన అవమానం తన జీవితాన్ని రాజకీయాల వైపు మళ్లించిందన్నారు. "నన్ను అవమానించిన కుటుంబంపైనే ఎన్నికల్లో పోటీ చేయాలని అప్పుడే నిర్ణయించుకున్నా" అని తెలిపారు. 2009లో పరకాల నుంచి పోటీ చేయాలనే నిర్ణయాన్ని ఎర్రబెల్లి దయాకర్‌రావు, వేం నరేందర్‌రెడ్డితో పాటు చంద్రబాబునాయుడికి వివరించినట్లు చెప్పారు. ఆ సమయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఓ నాయకుడు తనను చులకనగా మాట్లాడినా.. పరకాల నుంచే పోటీ చేయాలనే నిర్ణయం నుంచి వెనక్కి తగ్గలేదన్నారు.**

## కూతురు స్కూల్ అడ్మిషన్.. గ్రీన్‌వుడ్ ఆవిర్భావం

తన కుమార్తెను స్కూల్‌లో చేర్పించేందుకు వెళ్లిన సందర్భమే విద్యారంగంలోకి తీసుకొచ్చిందన్నారు. స్కూల్ లో సౌకర్యాలు లేకపోవడం, అప్పటి ప్రిన్సిపాల్ కొత్త పాఠశాల ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందని, ఒక భాగస్వామి ఉంటే బాగుంటుందని చెప్పడంతో 2003లో గ్రీన్‌వుడ్ స్కూల్ ను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రారంభం నుంచే పాఠశాలకు మంచి ఆదరణ లభించిందని, ఇప్పటి వరకు 23 బ్యాచ్‌లు పదో తరగతి పూర్తి చేసుకున్నాయని చెప్పారు.

